నాయకులు, కార్మికులతో మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ మూర్తి

యథేచ్ఛగా నకిలీలు

- మార్కెట్‌లోకి కల్తీ పత్తి విత్తనాలు - రెండేళ్లుగా నిండా మునిగిన రైతులు - తనిఖీలు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో మార్కెట్‌లోకి యథేచ్ఛగా కల్తీ పత్తి విత్తనాలు వచ్చి చేరుతున్నాయి. జిల్లాలో కల్తీ విత్తనాల వల్ల రైతులు గత రెండేళ్లుగా నిండా మునిగారు. అయినా అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. దీంతో పత్తి రైతుల భవిష్యత్తు ఈ ఏడాది కూడా ప్రశ్నార్థంగా మారింది...

గతేడాది లాగా ఈ ఏడాది కూడా నకిలీ పత్తి విత్తనాలు రైతులకు నష్టాలను మిగిల్చాయి. గతేడాది అత్యధికంగా క్వింటా పత్తి రూ.12,500 వరకూ పలికింది. దీంతో, ఈ ఏడాది పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. కర్నూలు జిల్లాలో పత్తి సాధారణ సాగు 6.11 లక్షల ఎకరాలు కాగా సాధారణ సాగుకు మించి 6.46 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొన్ని పత్తి విత్తనాల కంపెనీలు కల్తీ విత్తనాలను యథేచ్ఛగా అమ్మి సొమ్ము చేసుకున్నాయి. దిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూశారు. కర్నూలు డివిజన్‌లో 1.02 లక్షల ఎకరాల్లో, ఆదోని డివిజన్‌లో 1.40 లక్షలు, ఎమ్మిగనూరు డివిజన్‌లో 1.29 లక్షలు, ఆలూరు డివిజన్‌లో 1.35 లక్షలు, పత్తికొండ డివిజన్‌లో 1.35 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. నకిలీ విత్తనాల దాటికి 5 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టపోయింది. సూపర్ కాటన్, జంగి, ఆదిత్య, అఖిర, తడాకా, సూపర్, వింధ్య, లయన్, స్టాలిన్, 3228, కిలాడీ, 429 సూర్య, బిగ్‌బాస్, రాధిక, బిజి 2 వంటి 30 రకాల కంపెనీల విత్తనాలను కొని పంట దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయారు. కోట్లల్లో రైతుల పెట్టుబడి మట్టిపాలైంది. మరో వైపు కల్తీ పత్తి విత్తనాల రాక ఆరంభమైంది. కల్తీ విత్తనాలు యథేచ్ఛగా

మార్కెట్‌లోకి వచ్చి చేరుతున్నారు. నకిలీ, కల్తీ విత్తనాలపై దృష్టి సారించాల్సిన వ్యవసాయశాఖ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. జిల్లా పునర్విభజనలో నేపథ్యంలో తనిఖీలు చేసేందుకు సిబ్బంది కొరత ఉందని సాకుగా చెబుతున్నారు. ఏప్రిల్ నుంచే వ్యవసాయాధికారులు బృందాలుగా ఏర్పడి విత్తన శుద్ధి కేంద్రాల్లో తనిఖీలు చేయాల్సి ఉండగా ఆ ఊసే లేకుండా పోయింది. బిటి విత్తనాలకు సంబంధించి కో మార్కెటింగ్ లేకపోవడంతో సెంట్రల్ సీడ్ లైసెన్సు కలిగిన కంపెనీలకు చెందిన రకాలతో వివిధ కంపెనీలు ఆయా బ్రాండ్లతో బిటి పత్తి విత్తనాలను సిద్ధం చేస్తున్నాయి. కొన్ని కంపెనీల పేర్లతో కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చి చేరుతున్నాయి.

వ్యవహారం సాగుతుందిలా...

పత్తి పంట చేతికందాకా విత్తనాలను రైతుల దగ్గర నుంచి కొందరు దళారులు సేకరించుకుంటారు. జిల్లాలో జిన్నింగ్ మిల్లులు ఎక్కువగా ఉన్న నంద్యాల ప్రాంతం నుంచే ఈ వ్యవహారం మొదలవుతుంది. ఎలాంటి అనుమతులూ లేకున్నా పట్టణాల్లో వివిధ పేర్లతో ఉన్న ప్యాకెట్లలో, గ్రామాల్లో లూజు విత్తనాల పేరుతో ఈ విక్రయాలు సాగుతాయి. తక్కువ ధరతో నాణ్యమైన దిగుబడి వస్తుందంటూ రైతులకు ఆశ చూపుతారు. అయితే కొన్న విత్తనాలకు రసీదులు మాత్రం ఇవ్వరు. అలా నమ్మి సాగు చేసిన రైతులు పొలాల్లో దిగుబడి సరిగ్గా రాకపోవడంతో నిర్ఘాంతపోతారు. తీరా తాము మోసపోయామని తెలుసుకున్న రైతులు విక్రయదారులను ప్రశ్నిస్తే భూమి సరిగ్గా లేదనో, నీరు సరిగ్గా అందలేదనో సాగులు చెప్పి ప్లేటు మార్చేస్తారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఇదే తంతు సాగుతున్నా అధికారులు మాత్రం ప్రత్యేక దృష్టి సారించడం లేదు. జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, సి.బెళగల్, మంత్రాలయం ప్రాంతాల్లో ఈ నకిలీ విత్తన వ్యాపారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

కావాలంటే అప్పులూ ఇస్తారు..

నకిలీ విత్తనాల వ్యవహారంలో రైతులకు అప్పు ఆశ కూడా చూపిస్తారు. తమ దగ్గర విత్తనాలు కొంటే అప్పుగా ఇస్తారు. అప్పుకు సంబంధించి ప్రాంసరీ నోటును ఖచ్చితంగా రాయించుకుంటారు. పంట చేతికి రాక నష్టాల్లో కూరుకుపోయినా రైతు నుంచి ముక్కు పిండి మరీ డబ్బును వసూలు చేస్తారు. ఇలా నకిలీ వ్యవహారంలో రైతులు అప్పులపాలు కూడా అవుతున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కర్నూలు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు సిపిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. క్లాప్ డ్రైవర్లకు కనీసవేతనం రూ.18,500 ఇవ్వాలని, కాంటాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. సిఐటియు న్యూసిటీ, ఓల్డ్ సిటీ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు న్యూ సిటీ కార్యదర్శి సిహెచ్. సాయిబాబా అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా నాయకులు టి.రాముడు, ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.విజయ్, న్యూ సిటీ అధ్యక్షులు ఆర్.నరసింహులు, ఓల్డ్ సిటీ అధ్యక్షుడు ఎస్.అబ్దుల్లా, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, మల్లి ధర్నానుద్దేశించి మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు తెల్లవారుజాము నుండి ప్రజలు మేల్కొనక ముందే పనిలోకి వచ్చి నగరమంతా శుభ్రం చేస్తారన్నారు. ఎంత దుర్గంధ వాసన ఉన్నా భరిస్తూ తమ ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండగా ప్రజల ఆరోగ్యాలే మాకు ముఖ్యమని, శ్రమచేస్తున్న కార్మికులకు కనీస రక్షణ కిట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. తగినంత వేతనం ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. క్లప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18500 ఇవ్వాలని, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలని, కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. క్యాబ్ డ్రైవర్ అయ్యన్న అనారోగ్యంతో ఈనెల 15న మరణించాడని, అయ్యన్నకు నలుగురు ఆడపిల్లలు, భార్య ఉన్నారని, వారి కుటుంబాన్ని మున్సిపల్ కార్పొరేషన్, ఏజెన్సీ వారు వారికుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పర్యవేక్షణ కు వచ్చిన మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ పివివిఎస్. మూర్తి ధర్నా కార్యక్రమం వద్దకు వచ్చి మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాలరంగస్వామి

ప్రజాశక్తి -కర్నూలు లీగల్

కర్నూలు అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు ఎపిపిగా జి.బాలరంగస్వామిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జి.బాలరంగస్వామి ఎపిపిగా ఎన్నికైనందుకు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.నాగభూషణం నాయుడు, ఎం. చక్రపాణి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) కేంద్ర కమిటీ సభ్యులు న్యాయవాది కెంగర కుమార్, ఐలు జిల్లా నాయకులు సింగరాజు లక్ష్మన్న, వి.రవికుమార్, శివప్రసాద్ గుప్తా, సీనియర్ న్యాయవాదులు వై.జయరాజు, సివి.శ్రీనివాసులు, హెచ్.కె.జలంధర్, శ్రీవత్స, పోకల శ్రీనివాసులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు

- విద్యుత్‌శాఖ సిఎమ్‌డి సంతోషరావు హెచ్చరిక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ శాఖలో పనిచేసే అధికారులకు తామ కేటాయించిన ప్రదేశాల్లో పనిచేయకుండా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఎండి కె.సంతోషరావు హెచ్చరించారు. గురువారం కర్నూలు విద్యుత్ భవన్‌లో సమావేశ మందిరంలో కర్నూలు జిల్లా రూరల్ అధికారులతో సమీక్ష సమావేశం ఎస్ఇ ఎం.ఉమాపతి అధ్యక్షతన నిర్వహించారు. సిఎండి మాట్లాడుతూ ఉభయ జిల్లాలలో 2023-2024 సంవత్సరానికిగాను డిస్కాంపరిధిలో సుమారు 79 వేల వ్యవసాయ కనెక్షన్లను అందించామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లో పై కనెక్షన్లను మంజూరు చేస్తున్నామన్నారు. కాలం చెల్లిన స్తంభాలు, తీగలు, ఇతర సామాగ్రి కోసం రూ.15 కోట్ల నిధులు కేటాయించామన్నారు. డిస్కాం పరిధిలో 100 నూతన సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో వ్యవసాయదారులకు, విద్యుత్ వినియోగదారులకు కోతలేని విద్యుత్తును అందించామని చెప్పారు. జగనన్న కాలనీలకు సంబంధించి అన్ని పనులను పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. సిజిఎం ఒఅండ్‌ఎంలు కె. గురవయ్య, కెఆర్ఎస్ ధర్మజ్ఞాని రూరల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ సిఎమ్‌డి సంతోషరావు

నెలాఖరుకల్లా నాడు-నేడు పనులు పూర్తి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చివరి దశలో ఉన్న నాడు-నేడు పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు లో మన బడి నాడు - నేడు ఫేజ్-2 పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాడు నేడులో భాగంగా జరుగుతున్న తరగతి గదుల మరమ్మతుల పనులు 95 శాతం పూర్తయ్యాయని, అయితే వాటిని ఆన్‌లైన్ నమోదు చేయడంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు విఫలమయ్యారన్నారు. జిల్లాలో 651 పాఠశాలల్లో తరగతి గదుల మరమ్మతులకు గాను 617 పాఠశాలల్లో మరమ్మతులు భౌతికంగా పూర్తయ్యాయన్నారు. అయితే 118 పాఠశాలల్లో మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. 676 పాఠశాలల్లో విద్యుదీకరణ పనులకు గాను 600 పాఠశాలల్లో పనులు పూర్తికాగా, 70 పాఠశాలల్లో మాత్రమే ఆన్‌లైన్ నమోదు చేయడం చేశారన్నారు. శుక్రవారం లోపు పాఠశాలల్లో పూర్తయిన పనులను ఫోటో క్యాప్చర్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. చేయకపోతే శనివారం సునయన ఆడిటోరియంకు పిలిపించి ఇక్కడే పూర్తి చేయిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 237 పాఠశాలల్లో టాయిలెట్ల పనులు, 174 పాఠశాలల్లో కిచెన్‌షెడ్ పనులు, 289 పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. వీటిని ఈనెలాఖరుకు పూర్తిచేయాలని కలెక్టర్ ఇంజనీర్లను ఆదేశించారు.రూ.33 కోట్ల నిధులు అందుబాటు లో ఉన్నాయని, వీటిని అవసరమున్న పాఠశాలలకు శనివారంలోపు కేటాయించి, పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నాడు నేడు పనుల పురోగతి, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీపై శనివారం ఎంఇఒలు,హెడ్మాస్టర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పిఒ ఎస్ఎస్ఎ వేణుగోపాల్, ఎడి సామ్యూల్ పాల్, ఎపిఇడబ్ల్యుటిసి ఇఇ ఎం.లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఇఇలు, డిఇలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న కే సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిపిఎస్ విధానం ప్రమాదకరమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ విధానం అమలు చేయడం ద్వారా మూడు లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎలాంటి పెన్షన్ అందే అవకాశం ఉండదన్నారు. సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకున్నట్లు ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. ఈ విధానం పట్ల ఉపాధ్యాయులు తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయకపోతే ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు మారెప్ప, సహాధ్యక్షుడు రవికుమార్, ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శులు నవీన్ పాటి, నరసింహా, గాదలింగప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుని బదిలీ చేస్తున్న అధికారులు

సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ఉభయ జిల్లాలలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గురువారం పూర్తి అయిందని కర్నూలు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ తెలిపారు. అర్హులైన సచివాలయ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వారికి నగరంలోని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల కమిషనర్లు ,అడిషనల్ కమిషనర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొని బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. గరపాలక సంస్థ అదనపుకమిషనర్ పివిరామలింగేశ్వర పర్యవేక్షణలో నిర్వహించారు. ఇందులో శానిటేషన్ సెక్రటరీలు 12 మందికి 11 మంది హాజరైతే ఒకరు రిజెక్ట్ అయ్యారు. వెల్ఫేర్ సెక్రటరీలు 13 మందికి 13 మంది హాజరయ్యారు. అడ్మిన్లు 16 మందికి 15 మంది హాజరై ఒక రిజెక్ట్ అయ్యారు. కమ్యూనిటీ సెక్రటరీలు 13 మందికి 12 మంది హాజరై ఒకరు రిజెక్ట్ అయ్యారు. ప్లానింగ్ సెక్రటరీలు 20 మందికి 17 మంది హాజరై ముగ్గురు రిజెక్ట్ అయ్యారు. ఎడ్యుకేషన్ సెక్రటరీలు 20 మందికి 20 మంది హాజరయ్యారు. మొత్తం 103 మందిలో ఆరుగురు రిజెక్ట్ కాగా 97 మంది హాజరై వారి బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియను రీజినల్ డైరెక్టర్ పివివిఎస్.మూర్తి పర్యవేక్షించారు.

ముగిసిన తైక్వాండో వేసవి శిక్షణ

ప్రజాశక్తి-కర్నూల హాస్పిటల్

కల్లూరు మండలం ఎన్‌టిఆర్ నగర్‌లోడిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ వారు మే 1 నుండి 31 వరకు నిర్వహించిన ఫ్రీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగిసింది. ఎస్‌జె తైక్వాండో క్రీడా కారులు పాల్గొన్నారు. ముగింపులో ఎస్‌జె తైక్వాండో స్థాపకులు శివ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉందని తెలి పారు. అనంతరం ఆయన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. కోచ్‌లు ఇబ్రహీం, సురేంద్ర పాల్గొ న్నారు.

కంబదహాల్‌లో పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-సి బెళగల్ : మండలంలోని కంబదహాల్ గ్రామంలో ఇఒఆర్‌డి సందీప్ గురువారం పారిశుధ్య పనులను పరిశీలించారు. వీధులలో, కూడళ్ళలో, ప్రధాన కూడళ్ళలో ఎప్పటికప్పుడు పనులు చేపట్టి శుభ్రం చేసి అక్కడ మురుగు తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

నగర మేయర్ బివై.రామయ్య

19వ వార్డులో విద్యా కానుక కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పేద పిల్లలు చదువుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చక్కటి అవకాశాలను కల్పిస్తున్నారని, వాటిని అందిపుచ్చుకుని పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నగర మేయర్ బివై.రామయ్య సూచించారు. గురువారం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న 19వ వార్డు గణేష్ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. అంతకు ముందు నాడు-నేడు కింద రూ.15 లక్షలతో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదింటి పిల్లలు ప్రపంచాన్ని ఏలాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి విద్యా వ్యవస్థకు చాలా ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చదువుకు దూరమైన పిల్లలకు అమ్మ ఒడి వంటి పథకాలతో ముఖ్యమంత్రి ప్రోత్సాహిస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు తీర్చిదిద్దుతున్నారన్నారు. సిబిఎస్ఇ, ఇంగ్లీష్ మీడియం, మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లు, ఆరో తరగతి నుంచి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వంటి విప్లవాత్మక మార్పులతో రాష్ట్ర విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిచేలా చేశారన్నారు. పేద పిల్లల భవిష్యత్తును వైఎస్ జగన్ తన బాధ్యతగా తీసుకుని వారికి అత్యున్నత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోలు గోపాల్ రెడ్డి, ఎంఇఒ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు కుమార్ రెడ్డి,దేవుపూజ ధనుంజయ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లను అందజేస్తున్న నగర మేయర్ బివై.రామయ్య



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

సిఎం సహాయనిధి పేదలకు ఒక వరం

ప్రజాశక్తి-పత్తికొండ

సీఎం సహాయనిధి పేదలకు ఒక వరమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పత్తికొండలో ఎమ్మెల్యే స్వగృహంలో పత్తికొండ వెల్దుర్తి, క్రిష్ణగిరి తుగ్గలి, మద్దికేర మండలాల సంబంధించిన సీఎం సహాయనిధి రూ.25లక్షల విలువ గల చెక్కును 17 మంది లబ్ధిదారులకు కంగాటి శ్రీదేవి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలోనికి రాని రోగాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సహాయం చేస్తామన్నారు. అనేక రోగాలకు ఆపరేషన్లను చేయిస్తున్నామని చెప్పారు. పేదవారి ఆరోగ్యానికి, జీవితాలకు అండగా నిలుస్తానని చెప్పిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాటకు కట్టుబడి లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుండి ఆర్థిక బోరాసాన్ని కల్పిస్తున్నాడని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే శ్రీదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి నాయకులు బనగాన శ్రీనివాసులు, చక్రాల్లా సర్పంచి శ్రీరాములు పాల్గొన్నారు.

పశుబీమాపై అవగాహన విస్తృతం చేయాలి : జెడి

ప్రజాశక్తి- సి బెళగల్

పశు బీమాపై గ్రామాల్లో అవగాహన విస్తృతం చేయాలని పశు గణాభివృద్ధి జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య, డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ శివకుమార్ అన్నారు. గురువారం సిబెళగల్‌లో గూడూరు, సి బెళగల్ మండలాల పశువైద్యధికారులు ప్రవీణ్, రిచర్డ్, సునీల్, సుంకన్న, గంగమ్మల సమక్షంలో పశు శాఖా సిబ్బందితో సమీక్షించి మాట్లాడారు. రైతులు పశు బీమా చేసుకోవడం వలన సంభవిస్తున్న మరణాల పట్ల ప్రభుత్వం రూ.30 వేలు, రూ 15 వేలు చెల్లిస్తుందని, అదే గొర్రెలు మేకలు వంటి మూగ జీవాలకు రూ.6000 చెప్పున ఇస్తుందని అవగాహన పెంచుకోవాలని అన్నారు. పాడి సంపద మెరుగు పడాలంటే పాడి రైతులు బీమాపై కూడా తెలుసుకొని గ్రామాల్లో అవగాహన విస్తృతం చేయాలని కోరారు.

గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-క్రిష్ణగిరి

కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండల పరిధిలోని కంబాలపాడు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని ఆత్మహత్యతో విషాదం చోటుచేసుకుంది. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.... పాఠశాలలో ఎవరూ లేని సమయంలో విద్యార్థిని లూథియా (14) గదిలోకి వెళ్లి చున్నితో ఫ్యాన్‌కు ఉరేసుకొని బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సమయం తర్వాత విద్యార్థులు వెళ్లి చూడడంతో ఉరివేసుకొని ఉండటం గమనించారు. తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. పాఠశాల సిబ్బంది విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. అమ్మాయి 7వ తరగతి పూర్తి చేసుకుని వేసవి సెలవులకు సొంతూరు మల్లాపురం గ్రామానికి వెళ్లింది. వేసవి సెలవులు పూర్తి కావడంతో గురుకుల పాఠశాల సిబ్బంది వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ అమ్మాయిని పాఠశాలకు పంపించండని చెప్పారు. మీ అమ్మాయిని పాఠశాలకు పంపించకపోతే టిసి ఇచ్చి పంపిస్తామని గురుకుల పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపల్ వారి తల్లిదండ్రులకు తెలిపారు. ప్రిన్సిపల్ చెప్పిన మాటలకు అమ్మాయి తల్లిదండ్రులు భయపడి పాఠశాలకు పంపించకపోతే మా అమ్మాయికి టిసి ఇచ్చి ఇంటికి పంపిస్తారని భయంతోనే లూథియను బలవంతంగా బుధవారం సాయంత్రం 4:30 గంటలకు కంబాలపాడు గురుకుల పాఠశాలలో విడిచి పెట్టి మల్లాపురం గ్రామానికి వెళ్లారు. అమ్మాయిని వదిలివెళ్లిన మూడు గంటల తరువాత అమ్మాయి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటనపై ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులకు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

దేశంలోని వివిధ రాష్ట్రాలలోని సైనిక్ పాఠశాలలకు ఎంపికయిన 17 మంది ఎస్‌హెచ్‌ఎస్ అకాడమీ విద్యా ర్థులను జిల్లా ఎస్‌పి జి. కష్ణకాంత్ అభినందించారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అకాడమీ డైరెక్టర్ బికె.హరిబాబు మాట్లాడుతూ 6 వతరగతికి నిర్వహించిన ప్రవేశాలలో తమ అకాడమీ నుంచి 17 మంది విద్యార్థులు మహారాష్ట్ర, ఒడిస్సా ,ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, గుజరాత్, కర్ణాటక సైనిక్ పాఠశాలలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో విస్మయ్‌నాథ్ , కార్తికేయ, శౌర్య , భవాని శంకర్, కేతన్ , దైవక్, అఖిల్ , వికాస్, సాయి వెంకట్, వివేక్, వెంకటసాయి చరణ్, ప్రణీత్, జడల వివేక్, దీపక్ , అజంత్, రిషిక్ , మైత్రి ఉన్నారు.. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

అంగన్వాడీల పనితీరు మెరుగుపడాలి

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్
- అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉషాశ్రీ చరణ్

అంగన్వాడీ కేంద్రాల పనితీరు ఇంకా మెరుగుపడాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్ తెలిపారు. గురువారం పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో ఉన్న 25, 26, 27వ అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పెడుతున్న పౌష్టికాహారంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉషాశ్రీ చరణ్ మాట్లాడారు. పిల్లల మానసిక అంశాలను గమనిస్తూ ఉండాలని తెలిపారు. కేంద్రంలో ఉన్న పౌష్టికాహారం గుడ్లు, చిక్కీ, పాలు, బియ్యం, తదితర వాటిని తనిఖీ చేసి గర్భిణీలకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. పిల్లలతో అక్షరాలు దిద్దించి, రైమ్స్ చెప్పించారు. కేంద్రంలో ఉన్న ఇద్దరు చిన్నారుల బరువు తక్కువగా ఉండడంతో స్వయంగా పరిశీలించారు. చిన్నారుల బరువు తగ్గడలకు గల కారణాలను విశ్లేషించి దానికనుగుణంగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉంటున్న పిల్లల బరువు, ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అధికారులు నిరంతరం అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం హాజరు పట్టికను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు అందిస్తున్న భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమామహేశ్వరమ్మ, సిడిపిఒ సఫరున్నీసా బేగం పాల్గొన్నారు.

రాఘవేంద్రుని దర్శించుకున్న మంత్రి ఉషాశ్రీ చరణ్

మంత్రాలయం : మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని మంత్రి ఉషాశ్రీ చరణ్ దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆమెకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి, పిఆర్ఒ కార్యాలయ సిబ్బంది బిందు మాధవాచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. తహశీల్దార్ చంద్రశేఖర్, సిఐ శ్రీనివాసులు, విఆర్ఒ భీమనగౌడు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సీతారామిరెడ్డి

రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన మంత్రి ఉషాశ్రీ చరణ్‌ను వైసిపి నాయకులు వై.సీతారామిరెడ్డి కలిశారు. స్థానిక శ్రీమఠం అతిథిగృహంలో ఉన్న ఆమెను కలుసుకుని కుశల ప్రశ్నలు వేసి శాలువాతో సన్మానించారు.

తేలు, పాటుకాటుతో వరుస మరణాలు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- ప్రజా విశ్వాసం కోల్పోతున్న ఆదోని ప్రభుత్వాస్పత్రి

ప్రజాశక్తి - ఆదోని

తేలు, పాముకాటుతో చిన్నారులు వరుసగా మృత్యువాత పడుతుండడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదోని ఏరియా ప్రభుత్వాస్పత్రిలో కొందరు వైద్యులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, అంకితభావంతో వ్యవహరించడం లేదనే విమర్శలున్నాయి. వైద్యులను క్రమపద్ధతిలో పెట్టాల్సిన పాలకులు, ఉన్నతాధికారులు మెతక వైఖరి అవలంభిస్తుండడం వల్ల రాత్రి వేళల్లో విధులకు డుమ్మా కొడుతున్నారని రోగులు చెబుతున్నారు.

డివిజన్ కేంద్రమైన ఆదోని ఏరియా ఆస్పత్రికి ఆలూరు, హోళగుంద, కోసిగి, కౌతాళం, ఆస్పరి, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాలకు చెందిన ప్రజలు వస్తుంటారు. ఇక్కడ వసతులు లేకపోవడంతో పరీక్షలు చేయకుండానే కర్నూలుకు రెఫర్ చేస్తూ వైద్యులు చేతులు దులుపుకుంటున్నారని, కనీసం ప్రాథమిక చికిత్స కూడా అందించడం లేదని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తీవ్రంగా గాయపడి, తీవ్రత పెరిగి కోలుకోలేక కొందరు రోడ్డు మార్గంలోనే మృతి చెందిన సంఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా మానవత దృక్పథంతో వ్యవహరించి ఆదోని ఏరియా ప్రభుత్వాస్పత్రి పేరు ప్రతిష్టలు మసకబారకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వరుస మరణాలు : తేలు, పాముకాటుతో పక్షం రోజుల్లోనే ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రికి సకాలంలో తీసుకొచ్చినా సరైన వైద్యమందక మృతి చెందారనే విమర్శలు కూడా వచ్చాయి. ఈనెల 2న ఆస్పరి మండలం అలిగేర గ్రామానికి చెందిన భరత్ కుమార్ తేలుకాటుకు గురికావడంతో మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. సరైన మందులు, చికిత్స అందక ఆస్పత్రిలోనే మృతి చెందడంతో వివాదం నెలకొంది. వైద్యుల నిర్లక్ష్యంపై చిన్నారి బంధువులు మండిపడ్డారు. ఈ ఘటన మరువకముందే ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన హైమావతి అనే బాలిక పాముకాటుకు గురైంది. ఆస్పత్రికి తీసుకురాగా కోలుకోలేక మృతి చెందిందని బంధువులు తెలిపారు. ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నా, సకాలంలో ఇవ్వకపోవడంతో చిన్నారులు మృత్యువాత పడుతున్నారని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు మండిపడుతున్నారు.

మారని తీరు : ఆస్పత్రిలో కనీస సదుపాయాలపై కలెక్టర్ డాక్టర్ సృజన గత నెలలో తనిఖీలు చేశారు. అక్కడ టాయిలెట్, బాత్‌రూం, సమస్యలపై ఆస్పత్రి వర్గాలపై మండిపడ్డారు. ఆమె సూచన మేరకు సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆస్పత్రిలో తనిఖీ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆస్పత్రిని సందర్శించి పనులను పర్యవేక్షించారు. అయినా తీరు మారకపోవడంతో రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిధులునా ఖర్చు చేయని పరిస్థితి ఉందని పలువురు చెబుతున్నారు. నామమాత్రంగా నెలకోసారి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరుగుతూనే ఉంది. సమస్యలు అలానే ఉండడంతో అర్థం కావడం లేదని రోగులు వాపోతున్నారు.

ఆస్పత్రికి ఆలస్యంగా వస్తున్నారు
- డాక్టర్ లింగన్న, ఆస్పత్రి సూపరింటెండెంట్

తేలు, పాముకాటుకు గురైన వారు హుటాహుటిన ఆస్పత్రికి రావడం లేదు. నాటువైద్యం తీసుకుంటూ విషం శరీరంలోకి వ్యాప్తి చెందే వరకు ఉంటున్నారు. చికిత్స చేసినా కోలుకోక మృత్యువాత పడుతున్నారు. ఆస్పత్రిలో పాము, తేలు, కుక్కకాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయి. డ్యూటీ డాక్టర్లు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. నాటు వైద్యాన్ని ఆశ్రయించకుండా త్వరగా ఆస్పత్రికి వచ్చి మృత్యువాత పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అనవసరంగా వైద్యులపై నిందలు వేయవద్దు.

మృతి చెందిన భరత్ కుమార్ (ఫైల్)

రాష్ట్రంలో విద్య, వైద్యానికి పెద్దపీట

- పది, ఇంటర్, ప్రథమ స్థానంలో కోసిగి రావడం అభినందనీయం
- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ, ఆణిముత్యాల ప్రోత్సాహకాల పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి నేత వై.సీతారామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పది, ఇంటర్ పరీక్షల్లో కోసిగి మండలం అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరిన మురుగుదొడ్లు, చాలీచాలని పాఠ్య పుస్తకాలతో కాలం గడపాల్సి వచ్చేదని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాడు-నేడుతో పాఠశాలల రూపు రేఖలు మార్చేశారని చెప్పారు. విద్యతో పాటు వైద్య రంగంలో కూడా మార్పులు చేపట్టారని తెలిపారు. గతంలో పిహెచ్‌సిలకు ప్రస్తుతం ఎంతో తేడా ఉందని గుర్తు చేశారు. అనంతరం పది, ఇంటర్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు రిజ్వాన, మానస, అఫ్రజ్ భాను, జానకి, రాధమ్మ, నరసింహులు, అక్షయకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు పారితోషికం అందజేసి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సన్మానించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, ఎస్ఐ వేణు గోపాల్ రాజ్, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి, ఛైర్మన్ సాబ్జల్లి, ఎంఇఒ మోహనుద్దీన్, హౌసింగ్ డిఇ లాల్ కృష్ణయ్య, కోసిగి ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సమీరా రెడ్డి పాల్గొన్నారు.

ఆలూరు : విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదివి తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాల, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి తెలిపారు. జూనియర్ కళాశాల ఆడిటోరియంలో 'జగనన్న ఆణిముత్యాలు'లో భాగంగా నియోజకవర్గంలో పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రం అందజేసి, తల్లిదండ్రులను, ప్రధానోపాధ్యాయులను, ప్రిన్సిపల్స్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శ్రావణి స్వామి, శ్రీనివాసులు, తస్లీమ్, జయప్రకాష్, మంతేషా, వన్నూర్ స్వామి, విజయ్ కుమార్‌ను, వారి తల్లిదండ్రులను సన్మానించి, ప్రశంసాపత్రాలతో పాటు మెడల్, నగదు బహుమతులను అందించారు. జడ్‌పిటిసి ఏరూరు శేఖర్, ఆలూరు ఎంఇఒ రామాంజనేయులు, విశ్రాంత ఎంఇఒ కోమలదేవి, ప్రిన్సిపల్ వీరేశ్, శంకర్ ప్రసాద్, జమ్మన్న, డేవిడ్, ప్రధానోపాధ్యాయులు చక్రధర్, కోదండ నాయుడు, సుజాత, మల్లికార్జున, కరి బసప్ప, శ్రీనివాస రెడ్డి, సావిత్రమ్మ, ఎస్‌టియు నాగరాజు, వైసిపి కన్వీనర్ వీరేశ్, ఎస్ఎంసి ఛైర్మన్ అనుమయ్య, ఎంపిపి తనయుడు వీరేష్, దీపక్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఆలూరులో సన్మానిస్తున్న ఎంఇఒ, గుమ్మనూరు నారాయణ స్వామి

వ్యవసాయానికి 30 రోజుల్లో విద్యుత్ కనెక్షన్

- హెడ్‌క్వార్టర్స్‌లో లేని ఉద్యోగులపై చర్యలు - సిఎమ్‌డి సంతోష్ రావు

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్ కనెక్షన్ కోసం రుసుం చెల్లించిన రైతులకు 30 రోజుల్లోపు కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ రావు తెలిపారు. గురువారం ఆర్ట్స్ కళాశాలలో విద్యుత్ శాఖ డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. డిఇ, ఎఇలతో విద్యుత్ బకాయిలు, కనెక్షన్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని తెలిపారు. కొందరు ఉద్యోగులు హెడ్ క్వార్టర్స్‌లో లేకుండా ఇతరుల ప్రాంతాల్లో ఉంటున్నారని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు, ఒఅండ్ఎం సిబ్బంది అందరూ నిర్దేశించిన హెడ్ క్వార్టర్స్‌లో ఉండి వినియోగదారులకు సేవలందించాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు, అంతరాయాలను తగ్గించి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లుల చెల్లింపులను ఆన్‌లైన్‌లోనే చేసే విధంగా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు బకాయిలు లేకుండా వసూలు చేయాలని సూచించారు. చీఫ్ జనరల్ మేనేజర్‌లు గురువయ్య, ధర్మ జ్ఞాని, ఎస్ఇ ఉమాపతి, ఇంజినీర్ సుధాకర్ కుమార్, ఎడి పురుషోత్తం, రాఘవేంద్ర, రామకృష్ణ, నాగేంద్ర, ఎస్ఎఒ రాఘవులు, అసిస్టెంట్ ఇంజినీర్లు బోధిస్తున్నట్లు తెలిపారు.

అదనపు గదుల్లేక...

వరండాలో కూర్చున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని నౌలేకల్ గ్రామంలో ఎంపియుపి పాఠశాలలో అదనపు గదుల్లేక విద్యార్థులు వరండాలోనే కూర్చొన్నారు. ఉపాధ్యాయులు అక్కడే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఏమిటని ప్రశ్నిస్తే అదనపు గదుల్లేక ఇబ్బంది ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉందని చెప్పారు. అదనపు గదుల్లేక రెండు తరగతులను ఒకే గదిలో బోధిస్తున్నట్లు తెలిపారు. గురువారం సిపిఎం జిల్లా నాయకులు వెంకటేశులు, మండల కార్యదర్శి తిక్కన్న, పాండవగల్ వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, రాజేంద్రప్రసాద్‌లు ప్రధానోపాధ్యాయులతో సమస్యను అడిగి తెలుసుకున్నారు. తమ విద్యార్థులకు తగ్గట్టు గదుల్లేవని చెప్పారు. దీనిని వెంటనే పరిష్కరించాలని నాయకులు కోరారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్

కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, తాలూకా కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం జగన్మోహన్‌రెడ్డి సంకల్ప యాత్రలో మున్సిపల్ కార్మికులను 6 నెలల్లోపు రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రి మండలిలో మున్సిపల్ కార్మికుల రెగ్యులేజర్ గురించి ప్రస్తావనే లేదని, మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. తక్షణమే అన్ని విభాగాల్లో పని చేసే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు, పారిశుధ్యం, ఇంజినీరింగ్, క్లాప్ వేదర్, కంప్యూటర్ ఆపరేటర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. లేకపోతే దశలవారీగా ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. పింఛను, మెడికల్ లీవ్‌లు, 2వ శనివారం సెలవు, క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18 వేలు, మృతి చెందిన కార్మికుని స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని ఇన్‌ఛార్జీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు జె.నాగరాజు, కె.సాల్మాన్, ఇస్మాయిల్, మునీంద్ర, అల్తాఫ్, ఈరన్న, కేశన్న, నాగప్రసాద్, హరీష్, స్వామి, రంగస్వామి, రాజు పాల్గొన్నారు.

అమ్యూనిటీస్ సెక్రటరీలు

అందుబాటులో ఉండడం లేదు

- తనిఖీల్లో వెల్లడైతే సస్పెన్షన్ చేస్తాం
- కమిషనర్ రఘునాథ్‌రెడ్డి హెచ్చరిక

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని కొందరు సచివాలయ అమ్యూనిటీస్ సెక్రటరీలు అందుబాటులో ఉండడం లేదని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. గురువారం మున్సిపల్ ఛైర్మన్ శాంత అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి అజెండాలోని అంశాలను సభ్యులకు చదివి వినిపించారు. కౌన్సిల్‌నుద్దేశించి మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. పట్టణంలోని పాతబస్టాండ్ మైదానంలోని షాపింగ్ కాంప్లెక్స్ హోల్‌సేల్, రిటైల్ షాపులకు గుడ్‌విల్ ఆక్షన్ ద్వారా నిర్మించేందుకు గతంలో కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. దీనికి గాను సాంకేతికపరమైన అప్రూవల్‌కు అనుమతి వచ్చిందని తెలిపారు. ఆదోనికి చెందిన కాంట్రాక్టర్ రాజేంద్రప్రసాద్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు అనుమతి లభించిందని చెప్పారు. మున్సిపల్ పాఠశాలల్లో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వారికి ప్రభుత్వం వేతనాలు ఇవ్వాలని, మున్సిపాలిటీ ఎందుకు ఇవ్వాలని 30వ వార్డు కౌన్సిలర్ నాగరత్నమ్మ అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ద్వారానే 36 పాఠశాలల్లో 36 మంది స్వీపర్లు నెలకు రూ.4 వేల చొప్పున పని చేస్తున్నారని కమిషనర్ వివరించారు. వారికి నెలకు రూ.4 వేల చొప్పున రూ.1.44 లక్షలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. కుళాయిలకు నీరు సరఫరా అయ్యే సమయంలో అమ్యూనిటీ సెక్రటరీలు నీటి పరీక్షలు నిర్వహించే వారని, ప్రస్తుతం వారి జాడేలేదని కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ ఫిర్యాదు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తనకు కానీ, మున్సిపల్ ఇంజినీర్‌కు కానీ ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

మీడియాపై చిరుబుర్రు : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ముగియడంతో సభ్యులు లేవడానికి ప్రయత్నించారు. ఇంతలోనే జోక్యం చేసుకున్న ఛైర్మన్ శాంత కొంతసేపు అలానే కూర్చొని త్వరగా వెళితే విలేకరులు ఇష్టమొచ్చినట్లు వార్తలు రాస్తున్నారని చిరుబుర్రులాడారు. గత కౌన్సిల్ సమావేశం నిమిషాల్లోనే ముగియడంతో ప్రజా సమస్యలు గాలికొదిలి పెళ్లిళ్లు, పేరంటాలు ఉన్నాయని త్వరగా సమావేశం ముగిసిన సంగతి పత్రికల్లో ప్రచురించారు. దీనిపై ఆమె ఇలా స్పందించారు. అత్యవసర సమావేశం కాబట్టే అజెండాలోని అంశాలు తక్కువగా ఉండడం వల్ల సమావేశం త్వరగా అయిపోయిందని కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, సందీప్ రెడ్డి, లక్ష్మీదేవి వివరణ ఇచ్చారు. వైస్ ఛైర్మన్లు గౌస్ అహ్మద్, నరసింహులు, కౌన్సిలర్లు లక్ష్మి, అశోక్, చలపతి, ఉస్మాన్, కీర్తన, సురేష్, కోఆప్షన్ సభ్యులు తిమ్మక్క, డిప్యూటీ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్లు కృపాకర్, రాజశేఖర్ రెడ్డి, ఆర్ఒ అస్లాం బాష, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, శ్రీనివాసులు ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి

అంగన్వాడీ సర్టిఫికెట్ ఇస్తున్న సూపర్‌వైజర్ ప్రసూన

అంగన్వాడీల ద్వారా పిల్లలకు విద్యాబుద్ధులు

- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన

ప్రజాశక్తి - చిప్పగిరి

మూడేళ్లు దాటిన పిల్లలందరికీ అంగన్వాడీ పాఠశాలల్లో ఆటపాటలతో కూడిన విద్య ప్రారంభమవుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. గురువారం ఏరూరు అంగన్వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ ప్రసూన, ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 'జనభాగీదారి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్య దశలో మొదటి మూడేళ్లు ఇంటికే పరిమితమైన పిల్లలు ఆ తర్వాత బయట ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. ఈ వయస్సులో అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు నచ్చే రీతిలో ఆట, పాటలు, కథల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నట్లు చెప్పారు. పిల్లలు సత్ప్రవర్తనతో కూడిన విద్యనభ్యసించాలంటే ప్రతి తల్లిదండ్రులూ చక్కగా తీర్చిదిద్ది అంగన్వాడీ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఐదేళ్లు దాటిన తర్వాత అంగన్వాడీ సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. మహిళా సంరక్షకులు, సుమలత, అంగన్వాడీ టీచర్లు పార్వతి, లక్ష్మీ, సుభాని, ఆయాలు పాల్గొన్నారు.

విత్తన నాణ్యత పరిశీలన

హొలహర్వి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీడ్ క్వాలిటీ కంట్రోల్‌లో భాగంగా మండలంలోని చింతకుంట గ్రామంలో ఉన్న కిసాన్ మాల్ విత్తన షాపును ఎఒ శివశంకర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. బిటి పత్తి విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్, ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్, లైసెన్స్‌ను పరిశీలించారు. రికార్డులు కరెక్ట్‌గా ఉన్నాయా లేదా పరిశీలించారు. రెండు సీడ్స్ శ్యాంపిల్‌ను, బిటి పత్తి విత్తనాల శ్యాంపిల్‌ను తీసుకున్నారు. కృషి డాన్ కంపెనీకి సంబంధించిన త్రిశూల్, కావేరి కంపెనీకి సంబంధించిన జాదు రకాలను క్వాలిటీ కంట్రోల్ నిమిత్తం విత్తన పరీక్షకు పంపారు.

అంగన్వాడీలకు రూ.26 వేలు వేతనమివ్వాలి

- వెట్టిచాకిరి ఇంకెన్నాళ్లు - సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని+ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలకు రూ.26 వేల వేతనమివ్వాలని, అంగన్వాడీ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్రం మాదిరిగా వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పట్టణంలోని సిడిపిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి వెంకటమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనమివ్వాలని చట్టం చెబుతున్నా పాలకుల నిర్లక్ష్యం వల్ల అంగన్వాడీలు అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. ఇంకెన్నాళ్లు వెట్టిచాకిరి అని, హక్కుల సాధన కోసం ఉమ్మడి పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, కూరగాయల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిర్వహణ భారమైందని అధికారులకు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీతంలో సగం నెలనెల పింఛను విధానాన్ని అమలు చేయాలని కోరారు. సీనియారిటీ ప్రకారం సూపర్‌వైజర్లకు పదోన్నతి కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు సంక్షేమ పథకాలను అంగన్వాడీలకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి, ఇతరులకు ఇచ్చే సంక్షేమ పథకాలను వర్తింపజేయకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఆరోగ్యం బాగా లేని వారికి వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, మండల కార్యదర్శి వీరారెడ్డి, ప్రాజెక్ట్ అధ్యక్షులు వరలక్ష్మి, సరోజ, అంగన్వాడీ లక్ష్మి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** సిడిపిఒ కార్యాలయంలో ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, తాలూకా కార్యదర్శి బి.రాముడు మాట్లాడారు. బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని సీనియర్ అధికారికి వినతిపత్రం అందజేశారు. నాయకులు బి.గోవర్ధనమ్మ, బి.పద్మ, ఎస్.నాగలక్ష్మి, సెక్టార్ కార్యకర్తలు కె.నాగేశ్వరమ్మ, ప్రభావతి, మేరీ, అక్తర్, తులసీ, శైలజ, మల్లేశ్వరి, నాగమణి, లక్ష్మి, ప్రమీలమ్మ, పుష్పావతి, రామలింగమ్మ, గౌషియాబేగం, సరోజ, భాగ్యమ్మ, సిఐటియు నాయకులు రాజు పాల్గొన్నారు. **ఆలూరులో** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు ఐసిడిఎస్ ప్రాజెక్టు ముందు ధర్నా నిర్వహించారు. సిడిపిఒ లలితకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణ స్వామి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, జయశ్రీ, సిఐటియు నాయకులు వెంకటేశులు, మైనా పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాధాకృష్ణ

విద్యుదాఘాతంతో హోటల్ దగ్ధం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ భారత్ పెట్రోలు బంకుకు ఎదురుగా ఉన్న కళ్యాణి బిర్యాని హోటల్ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై దగ్ధమైంది. బాధితునికి రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. వివరాలిలా ఉన్నాయి... మండలంలోని అలారుదిన్నె గ్రామానికి చెందిన హరిజన నరసన్న గత కొన్నేళ్లుగా కళ్యాణి బిర్యాని హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవారు. గురువారం విద్యుదాఘాతంతో మంటలు వ్యాప్తి చెంది హోటల్ పైకప్పు, అందులోని వస్తు సామగ్రి, సరుకులు కాలిపోయాయి. పత్తికొండ అగ్నిమాప కేంద్రానికి సమాచారం అందించగా ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చాయి. అగ్నిప్రమాదంతో నష్టపోయిన తనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని బాధితుడు నరసన్న కోరారు.

ఉద్యోగం పేరిట మోసం చేస్తున్న ముఠా అరెస్టు

- బ్యాంకు అకౌంట్‌లోని రూ.18 లక్షలు సీజ్

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగాలు ఇస్తామని పేపర్లలో ప్రకటనలు ఇచ్చి నిరుద్యోగులను నమ్మించి మోసం చేస్తున్న ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. గురువారం వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో సిఐ విక్రమ్ సింహా ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతరాష్ట్ర స్థాయిలో నిరుద్యోగులను మోసం చేస్తున్న ముఠాను సిఐ విక్రమ్ సింహా తన సిబ్బందితో అరెస్టు చేశారని తెలిపారు. ఇటీవల కర్నూలు నగరానికి చెందిన నాగ పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ముఠా అక్రమాలు వెలుగు చూశాయని చెప్పారు. నిందితులు కాలువ నరసింహులు, బెస్త సంజయ్, శ్రీనివాసులు, మహ్మద్ సులేమాన్, డి.మహబూబ్ బాషను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. డీఎస్పీ వివరాల మేరకు... ఆదోని వన్ టౌన్ సిఐ విక్రమ సింహా, సిబ్బంది హక్ హాజీ బాష, రామచంద్ర, మహేశ్వరప్ప, లక్ష్మణ్‌లు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నిందితులు నవ భారత్ ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్ట్స్ ప్రయివేట్ లిమిటేడ్ అనే కంపెనీ పేరుతో ఫేక్ బ్రోచర్‌ను క్రియేట్ చేసి 'సాక్షి' దినపత్రికలో యాడ్ వేశారు. 'మా కంపెనీ ఎల్ఇడి బల్బులు ఇంటి వద్దనే ఉండి, ఫీట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదించవచ్చు' అని, వివరాలకు సంప్రదించాలని ఓ నెంబర్ ఇచ్చారు. ఎలాంటి ప్రూఫ్ లేకుండా 7 సిమ్ కార్డులు తీసుకుని ఈ నెంబర్లను ప్రకటనల్లో ఇస్తూ కస్టమర్లతో మాట్లాడేవారు. ప్రజల వద్ద వివిధ రకాల చార్జీల పేరిట, కిట్ చార్జీల పేరుతో విడతల వారీగా ఒక్కో వ్యక్తి నుంచి తక్కువ అంటే రూ.1050 నుంచి రూ.18 వేల వరకు ట్రాన్స్‌ఫర్ చేయించుకునేవారు. వారికి పని కల్పించకుండా, ఎప్పటికప్పుడు సిమ్ కార్డులను మారుస్తూ 8 జిల్లాల నుంచి సుమారు 800 నుంచి 1000 మంది కస్టమర్ల నుంచి దాదాపు రూ.53 లక్షలను ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. వాటి నుంచి సుమారు రూ.30.60 లక్షలను అవసరాలకు, విలాసవంతమైన జీవితం గడిపేందుకు ఖర్చు చేశారు. నిందితులు, వారి సంబంధీకుల వివిధ బ్యాంకు అకౌంట్లలో ఉన్న సుమారు రూ.18.66 లక్షలను ఫ్రీజ్ చేయించి, నిందితులను టిజిఎల్ కాలనీ నుంచి మైనారిటీ కాలనీకి వెళ్లే దారిలో గల ఈద్గా వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి 3 సెల్ ఫోన్లు, బ్యాంకు పాసు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివ నారాయణ స్వామి

పెద్దచెరువు సమస్యను పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న మండలంలోని పాండవగల్ గ్రామంలో పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, నాయకులు జె.రామాంజనేయులు, శాఖ కార్యదర్శి కె.పాండురంగ మాట్లాడారు. పాండవగల్ గ్రామంలో సర్వే నెంబర్ 135లో ఉన్న 20 ఎకరాల పాండవగల్ పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలని కోరారు. హైకోర్టులో కేసును వేగవంతం చేయాలని, ప్రస్తుతానికి పొలం సాగు చేయకుండా ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ సమస్యపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కోర్టులో కేసును వేగవంతం చేసి స్టే వేకెట్ చేయించాలని కోరారు. అలాగే పొలం సాగుదారులు ఎవరూ పొలంలోకి వెళ్లకుండా ఉండాలన్నారు. మధ్యలో స్టే వేకెట్ అయితే రైతులు ఇబ్బంది పడతారని తెలిపారు. వైసిపి నాయకులు ఆర్.శ్రీనివాస్ రెడ్డి, హనీఫ్ బాషా, గోవిందు, నాయకులు కృష్ణ, భీమయ్య, వై.హుసేని, కె.భీమాంజనేయ, హనుమంత రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్, డిజె.నర్సిరెడ్డి, కె.కొండయ్య, వై.తాయన్న, హోటల్ ఈరన్న, కె.హుసేని, కె.ఆంజనేయ, రైతు టి.గోవిందు రెడ్డి, పి.ప్రసాద్, పాతిరెడ్డి పాల్గొన్నారు.

వేదవతి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి : సిపిఐ

ఆలూరు : వేదవతి రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టి త్వరగా సాగు, తాగునీరందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. గురువారం బిలెహాల్, నెట్రవట్టి గ్రామాల మధ్య నిలిచిపోయిన ప్రాజెక్టు పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేదవతి ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని, వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిలతోనే నిర్మించి ఆస్పరి మండలానికి కూడా సాగు, తాగునీరు వర్తింపజేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి, విరుపాక్షి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, దేవనకొండ మండల కార్యదర్శి నరసరావు, హోళగుంద మండల సహాయ కార్యదర్శి మారెప్ప, ఎస్ఎస్.బాష, శివ, చంద్రకాంత్ రెడ్డి, వ్యకాస నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :KURNOOL
S.O.P.No.5/2023

Smt.Attaluri Kadambari
W/o Late C.Rajanikanth,
Now residing at H.No.205-C,
Gudipati gadda,Nandyal Town,
Now Residing at H.No.87/725,
Madhava Nagar,Kurnool. ...Petitioner
-Vs-
Nil. ...Respondents

PUBLIC NOTICE

The petitioner is the wife of Late C.RajaniKanth. The said C.Rajani Kanth died on 7/6/2022 intestate leaving behind him the petitioner as her only heir. The Rajani Kanth while he alive schedule mentioned amount are deposited in the bank.She filed the petition for the garnt of Suceession certificate regarding to fixed deposits.

In this regard any body has any objection for the grant of Suceession Certificate,he /she can attend before tha above said court on 30/6/2023 at 10.30 A.M and submits your objections personally or through Advocate. otherwise petition shall be decided in accordance with law.

SCHEDULE:
Fixed deposits in Andhra Pragathi Grameena Bank,Kisan Nagar Branch,Kurnool.
Fixed Bond No.1).91127109882 : Rs.79,069/- .2).91127111053 : Rs.79,069/-. 3).91127110060 : Rs.79,069/-.4).91127108981: Rs.79,069/-.5).91127109984 : Rs.1,01,208/-. 6).91127109768 : Rs.79,069/-.7).91127111020 : Rs.2,27,431/-.8).91127110990 : Rs.1,91,118/-. 9).91127110901 : Rs.53,504/-.10).91132754916 : Rs.32,712/-.11).9113291925 : Rs.33,238/-. 12).91137024860 : Rs.59,781/-.13).91142028427 : Rs.52,735/-.14).91137025047 : Rs.59,781/- 15).91137024917 : Rs.9,781/-.16).91142028552: Rs.59,253/-.17).91142028686 : Rs.59,253/-.
Total Mturity Value :Rs13,85,140/-

BY ORDER OF THE COURT
P.SIVA SUDHARSHAN
ADVOCATE FOR THE PETITIONER
KURNOOL
MOBILE : 7013012458

‘ఫ్రీ ఫైర్’ రగడ

- కత్తులు, కర్రలతో రెండు గ్రామాల యువకుల దాడి - ఐదుగురికి గాయాలు

దాడిలో గాయపడిన యువకుడు హరి ఠాగూర్

ప్రజాశక్తి - మహానంది

ఫ్రీ ఫైర్ మొబైల్ గేమ్ విషయమై కొందరు యువకుల మధ్య మొదలైన వివాదం రెండు గ్రామాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఓ గ్రామం యువకులు కత్తులు, కర్రలతో మూకుమ్మడిగా మరో గ్రామం యువకులపై దాడికి దిగిన ఘటన బుధవారం రాత్రి మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బసాపురం గ్రామానికి చెందిన యువకుడు హరి ఠాగూర్ అలియాస్ రంగ స్వామి, గాజులపల్లి గ్రామానికి చెందిన యువకుడు హర్షద్‌లు బుధవారం రాత్రి మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్‌లో ఫ్రీ ఫైర్ గేమ్ ఆడుతూ ఇద్దరి మధ్య మాటమాట పెరిగి దూషణలకు దారి తీసింది. రాత్రి 9 గంటల సమయంలో హర్షద్ తన మిత్రులతో కలిసి బసాపురం హరి ఠాగూర్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. విషయం తెలిసిన ఠాగూర్ బంధువులు రాత్రి పది గంటల సమయంలో కొంత మంది యువకులతో కలిసి గాజులపల్లి గ్రామంలోని బ్యాంకు బజారులో హర్షద్, మిత్రులపై విచక్షణారహితంగా దాడులు చేశారు. దీంతో హర్షద్ పారిపోయాడు. మళ్లీ బసాపురంకు చెందిన కొందరు యువకులు కత్తులు పట్టుకొని హర్షద్ బంధువుల కుటుంబ సభ్యులను గాలిస్తూ దాడులకు పాల్పడ్డారు. హర్షద్ ఇంటిని, మిత్రుల ఇండ్ల వాకిళ్లను ధ్వంసం చేశారు. ఈ వివాదంలో హరి ఠాగూర్, హర్షద్‌తోపాటు మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న మహానంది ఎస్సై జి నాగేంద్ర ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని అల్లరి మూకలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దాడి ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

‘నకిలీ’ కట్టడికి చర్యలు

- విత్తన నమునాల శాంపిల్స్ సేకరణ
- జిల్లాలో 1100 నమూనాలు లక్ష్యం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో నకిలీ విత్తనాలకు అడ్డుకట్టు వేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా విత్తన దుకాణాల నుండి విత్తన నమూనాల శాంపిల్స్ సేకరణ పనిలో జిల్లా వ్యవసాయ అధికారులు నిమగ్నమయ్యారు. నంద్యాల జిల్లాలో 1100 విత్తన నమూనాల శాంపిల్స్ సేకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలు ఇచ్చింది. వీటిలో 150 పత్తి, 50 మిరప, 900 వివిధ రకాల నమూనా విత్తనాలు సేకరించాల్సి ఉంది. డివిజన్, మండలాల వారీగా సేకరించాలని జిల్లా వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అలాగే నెల వారి విత్తన నమూనాల సేకరణ చేపట్టాలని సూచించారు. మే, జూన్ నెలలకు గాను 350 నమూనా శాంపిల్స్ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 246 సేకరించినట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. వాటిలో 130 వివిధ రకాల విత్తనాలు, 108 పత్తి, 8 మిరప విత్తన నమూనాలను వివిధ దుకాణాల నుండి సేకరించారు. సేకరించిన వాటిని పరీక్షల నిమిత్తం ఇన్‌సైట్ యాప్ ద్వారా వచ్చే అడ్రస్‌కు మండల వ్యవసాయ అధికారులు పంపించారు. దానికి సంబంధిత నమూనా ఫలితాలను బట్టి చర్యలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి.

శాంపిల్స్ సేకరణతో బేంబేలెత్తుతున్న దుకాణ యజమానులు

విత్తనాల నమూనా శాంపిల్స్ సేకరణ ప్రారంభం కావడంతో జిల్లాలో విత్తనాల దుకాణాల యజమానులు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలో నకిలీ విత్తనాల బెడద అధికంగా ఉండటం, గత ఖరీఫ్, రబీలో నకిలీ విత్తనాల వలన రైతన్న తీవ్రంగా నష్టపోవాడాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా కలెక్టర్ ఈ ఏడాది ఖరీఫ్‌లో నకిలీ విత్తనాల వలన నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ తీసుకుంటున్న చర్యలతో అక్రమార్కులలో, నకిలీ దుకాణాల నిర్వాహకుల్లో భయం పుట్టుకుంది. విత్తన నమూనా శాంపిల్స్ సేకరణ, పరీక్షల ద్వారా నకిలీకి అడ్డుకట్టు పడుతుందో లేక ఫలితాలను తారుమారు చేసి ఉన్నతధికారులకు కిందిస్థాయి అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చి చేతులు దులుపుకుంటారో వేచి చూడాల్సిందే.

మరింత నమ్మకం పెంచండి

- కర్నూల్ జిల్లా రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీసులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలని కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.ఎస్.సెంథిల్ కుమార్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్, 2 టౌన్ పోలీసు స్టేషన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్లను కర్నూలు జిల్లా రేంజ్ డిఐజి తనిఖీ చేశారు. అంతకు ముందు డిఐజి తాలూకా పోలీస్ స్టేషన్‌కు రాగానే జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకట రాముడు, సబ్ డివిజన్ డిఎస్పి సి.మహేశ్వర్ రెడ్డిలు స్వాగతం పలికారు. తాలూకా ఎస్సై రామ్మోహన్ రెడ్డి, 2 టౌన్ ఎస్సై హరి ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై నవీన్ బాబు, వారి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన స్టేషన్ పరిసరాలను, స్టేషన్ల పనితీరును, రికార్డులను, సిసి కెమెరాల పని తీరును పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిఐజి పోలీసు అధికారులకు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలీసు స్టేషన్ల పరిధిలో నేర, శాంతి భద్రతల పరిస్థితిలు, అసాంఘిక కార్యకలాపాలు, ఎక్కువగా జరిగే నేరాలపై అధికారులను ఆరా తీశారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యక దృష్టి ఉంచాలని, దర్యాప్తులో ఉన్న కేసులలో వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను అరెస్ట్ చేయాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలనానరు. ప్రతి ఒక్క రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సైబర్ క్రైమ్, ఆన్లైన్ ఫ్రాడ్లు, 1930, దిశ యాప్ రిజిస్టేషన్, డయల్ 112, 100 నంబర్లు వాటి ఉపయోగం విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వార్డు మహిళ కార్యదర్శులతో మాట్లాడి వారికి కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రతి సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందించాలని ఆదేశించారు. అనంతరం నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. బ్లూ కోర్స్ వాహనాలను పరిశీలించారు. నంద్యాల పట్టణంలో ఎక్కడబడితే అక్కడ వాహనాలు పార్క్ చేయకుండా, రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, రహదారులపై వాహనాలు నిలపడం, రాంగ్ రూట్, త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. త్రిబుల్, ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌లకు పాల్పడే యువకులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు.

బ్లూ కోర్స్ ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న డిఐజి

హామీలు అమలు చేయాలి

- సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నిర్మలమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ గురువారం నంద్యాలలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు సిఐటియు, యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు డి.నిర్మలమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాల్ని అమలు చేయమని గత నాలుగు సంవత్సరాల ఎన్నో వినతులు ఇచ్చినప్పటికీ స్పందన లేదన్నారు. ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, సుప్రీం కోర్టు. తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చెయ్యాలని కోరారు. ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయని, కానీ పెరుగుతున్న (మిగతా 6వ పేజీలో..)

నంద్యాలలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, అంగన్వాడీలు

కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు
- మున్సిపల్ కార్యాలయం కార్మికులు ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యాలను, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మున్సిపాలిటీలలో పని చేసే కార్మికులకు జిఒ 7 ప్రకారం స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలను అమలు చేయాలని (మిగతా 6వ పేజీలో..)

నంద్యాల మునిసిపల్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

టూరిస్ట్ రెస్టారెంట్ నిర్వహణకు వేలం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్ద గల పర్యాటక శాఖ రెస్టారెంట్ నిర్వహణ నిమిత్తం జిల్లా పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ గురువారం కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో బహిరంగ వేలం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ ప్రారంభం ధర రూ. 51 వేలు మొదలుపెట్టగా సింగవరం వెంకటరమణ, కొత్తపల్లి గ్రామం వారు సంవత్సరానికి 2 లక్షల 18 వేల రూపాయలకు అధిక వేలం పాడి దక్కించుకున్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని రవ్వలకొండ మీద పూదోట లింగావధూత స్వామి ఆరాధన మహెూత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. లింగమూర్తి మఠం కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు మాజీ సర్పంచి బిసి. రాజారెడ్డి మహెూత్సవానికి హాజరై స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరన్న, లింగమూర్తి, రమణమూర్తి, వజ్రం కృష్ణారెడ్డి, రామసుబ్బయ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి యాదవ్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని సాదుకొట్టం గ్రామానికి చెందిన అఖిలభారత యాదవ మహాసభ మండల మాజీ గౌరవ అధ్యక్షులు, యాగంటి శ్రీ యాదవ సమాజ అన్న సత్రం గౌరవ అధ్యక్షులు కొట్టం మద్దిలేటి యాదవ్ మృతి యాదవ సంఘానికి తీరని లోటు అని అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్, బీసీ సంఘం జిల్లా నాయకులు పాండురంగ యాదవ్‌లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని సాదుకొట్టం గ్రామానికి చెందిన కొట్టం మద్దిలేటి యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. మద్దిలేటి యాదవ్ మృతదేహానికి అఖిలభారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గం కన్వీనర్ మద్దయ్య యాదవ్, బీసీ సంఘం జిల్లా నాయకులు పాండురంగ యాదవ్, యాగంటి శ్రీ యాదవ సమాజ అన్న సత్రం అధ్యక్షులు పాములేటి యాదవ్, సిపిఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి యాదవ్, యాదవ సంఘం నాయకులు కుమారస్వామి యాదవ్, చెంచుబోయిన విజయ్ యాదవ్, పాతపాడు వెంకటసుబ్బయ్య యాదవ్, సానం సుబ్రహ్మణ్యం యాదవ్, వేములపాడు సుధాకర్ యాదవ్, దేవేంద్ర యాదవ్ బాలకృష్ణ యాదవ్‌లు మద్దిలేటి యాదవ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి మద్దిలేటి యాదవ్ ఎంతో కృషి చేశారని తెలిపారు.

నివాళులర్పిస్తున్న యాదవ సంఘం నాయకులు

క్రీడా సాధన, శారీరక శ్రమతో చక్కటి ఆరోగ్యం

ప్రజాశక్తి - గడివేముల

శారీరక శ్రమ చక్కటి ఆరోగ్యాన్ని, ఎంచుకునే లక్ష్యం పట్ల ఆసక్తిని పెంచుతుందని శ్రీ రాజ రాజేశ్వరీ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎం.రాఘవేంద్రరావు అన్నారు. నంద్యాల స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమం గురువారం శ్రీ రాజ రాజేశ్వరీ హైస్కూల్ ఆవరణంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హైస్కూల్ కరెస్పాండంట్ యం.రామేశ్వరరావు, ప్రిన్సిపల్ ఎం.రాఘవేంద్ర రావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల ప్రెసిడెంట్ కెవి.కృష్ణయ్యలు హాజరై క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపుల ప్రాధాన్యతను గుర్తించి 30 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం మంచి పరిణామమని అన్నారు. శ్రద్ధతో సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చని అన్నారు. శారీరకంగా ధృడంగా ఉంటేనే చదువుకోగలుగు తారన్నారు. ప్రతిఒక్కరు తల్లిదండ్రులను, గురువులను గౌరవించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని చెప్పారు. డాక్టర్ కెవి.కృష్ణయ్య మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. అనంతరం సమ్మర్ క్యాంప్ నిర్వహించిన క్యాంప్ ఇంఛార్జి షేక్ సల్మాన్ భాషను అభినందించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

డ్రైయినేజీ వ్యవస్థ మెరుగనకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

డ్రెయినేజీ వ్యవస్థ మెరుగునకు చర్యలు తీసుకుంటున్నామని, లో లెవల్ ఉన్న కాలువలను సరి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డి తెలిపారు. గురువారం నంద్యాల పట్టణంలో ప్రత్యేక టీంలను వేసి డ్రెయినేజీలలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తీయించారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బందితో కలిసి కమిషనర్ గాంధీ చౌక్, ఆర్‌టిసి బస్టాండ్, బాలాజీ కాంప్లెక్స్, నూనెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర, మెడికల్ కళాశాల వద్ద, బర్మశాల వీధి, 28వ వార్డులో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బర్మల్ వీధిలో డ్రెనేజీ లోలెవల్ ఉండటం వలన సమస్యలు వస్తున్నాయని, దాన్ని లెవల్ చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. నంద్యాల పట్టణంలో 324 కిలోమీటర్లు మేర డ్రెయినేజీ వ్యవస్థ ఉందని, అందులో 224 కిలోమీటర్ల మేర పక్కా ఉందని, 40 కి.మీ కచ్చా, 70 నుండి 90 కి.మీ మైనర్ డ్రెయినేజీ ఉందన్నారు. ప్రజలు వ్యర్థ పదార్థాలను, తిను బండరాలను, ఇంటిలోని పరుపులను, చెత్తను కాలువల్లో వేయకుండా చెత్త సేకరించడానికి వచ్చే వారికి ఇవ్వాలని సూచించారు.

సిల్ట్ తీత పనులను పరిశీలిస్తున్న కమీషనర్

వృద్ధులను ఆదరించాలి

- ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్‌టిసి ఆర్‌ఎ శాంతి

ప్రజాశక్తి-డోన్

వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులను ఆదరించాలని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్ఎ.శాంతి అన్నారు. గురువారం డోన్ మండల పరిధిలోని ఓబులాపురం మిట్ట వద్ద ఉన్న వృద్ధాశ్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యురాలు సూర్య కుమారి, ప్రముఖ వ్యాపారవేత్త ఓలేటి మాధవస్వామి ఆర్థిక సౌజన్యంతో వృద్ధులకు ఉపయోగపడే రెండు స్టాండింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్ఎ శాంతి మాట్లాడుతూ సేవా భావంతో ఇన్నర్ వీల్ క్లబ్ ముందుకు వెళుతుందన్నారు. చేసే సహాయం ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఆశ్రమంలో ఉండే వృద్ధులకు ఈ ఫ్యాన్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు రాజాసుజాత, శారద తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి స్టాండింగ్ ఫ్యాన్లను అందిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్ఎ శాంతి

లింగాలలో చేగువేరా జయంతి

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని లింగాల గ్రామంలో చేగువేరా 95వ జయంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నాడు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం చేసిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి డి సోమన్న మాట్లాడుతూ చేగువేరా అతిచిన్న వయస్సులో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు . ఈ కార్యక్రమంలో కోలన్న బందం గురువు కొల్లమయ్య, సిపిఎం మండల కమిటీ సభ్యురాలు బి రమణమ్మ, బాల యేసు, ఎస్సార్ రమణ, ఎం. సామన్న, కళ్యాణి, సోమేశ్వరమ్మ, ఈశ్వరమ్మ, సవరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చేగువేరా చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ డిడి

పశు బీమాను వినియోగించుకోండి

ప్రజాశక్తి - రుద్రవరం : వైయస్సార్ పశు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిడి డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో రుద్రవరం ప్రాంతీయ పశు వైద్యశాల ఏడి డాక్టర్ గిడ్డయ్య ఆధ్వర్యంలో సిరివెళ్ల, రుద్రవరం పశువైద్య సిబ్బందికి వైయస్సార్ పశు బీమా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ పశు బీమా పథకంలో ఫారం గేదెకు రైతు ఇన్సూరెన్స్ రూ. 400 చెల్లిస్తే మూడు సంవత్సరాల వ్యవధిలో గేదె చనిపోతే రూ.30,000 ఇన్సూరెన్స్, నాటు గేదెకు రైతు రూ.200 చెల్లిస్తే రూ.15 వేలు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. రైతులు సిబ్బంది ద్వారా వైయస్సార్ పశు బీమా పథకంలో చేరాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రగుడిదిన్నె పశు వైద్యశాల డాక్టర్ మనోరంజన ప్రతాప్, సిరివెళ్ల డాక్టర్ దస్తగిరి, గోవిందపల్లి డాక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది గోపాలమిత్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చల్లా విగ్నేశ్వర్ రెడ్డికి గన్‌మెన్ల కేటాయింపు

ప్రజాశక్తి - అవుకు : దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి పెద్ద కుమారుడు, వైసిపి నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డికి ప్రభుత్వం గన్‌మెన్లను కేటాయించింది. గురువారం స్థానిక విలేకరులతో చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిరోజు గ్రామాల్లో పర్యటిస్తున్నానని, భద్రత దృష్ట్యా ప్రభుత్వం వన్ ప్లస్ వన్ గన్‌మెన్లను కేటాయించిందని తెలిపారు. రాబోవు రోజుల్లో నియోజకవర్గ స్థాయిలో వైసిపిని మరింత ముందుకు తీసుకువెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గన్‌మెన్లను కేటాయించడం పట్ల ఆయన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .

కాటసాని నాగార్జున రెడ్డికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని స్వర్గీయ కాటసాని నాగార్జున రెడ్డి ఘాట్ వద్ద స్వర్గీయ కాటసాని నాగార్జున రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

గౌరు వెంకట రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం తెలుపుతున్న నేతలు

డెంటల్ ఆస్పత్రిని ప్రారంభించిన గౌరు

ప్రజాశక్తి - నందికొట్కూరు

పట్టణంలో ఐ కేర్ డెంటల్ హాస్పిటల్‌ను నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షుడు గౌరు వెంకట్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో డెంటల్‌కు సంబంధించిన చికిత్సలు లేకపోవడం శోచనీయమన్నారు. వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డెంటల్ హాస్పిటల్ డాక్టర్ హరి, మాజీ సర్పంచ్ మండ్లెం రమణ, టౌన్ ఎస్ఐ ఎన్వి రమణ,కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ముర్తుజావలి, జయ సూర్య, లాయర్ జాకీర్ హుస్సేన్, షకిల్ అహ్మద్, నిమ్మకాయల రాజు, కళాకరు, రగడ,కిరణ్, రిజ్వాన్, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడు మృతి

ప్రజాశక్తి - బేతంచర్ల

పురుగుల మందు తాగి కోలుకోలేక వ్యక్తి మృతి చెందాడు. వివరాల మేరకు.. బేతంచెర్ల పట్టణం శేషారెడ్డి నగర్ కాలనీ నివాసి అయిన పఠాన్ నబీ ఖాన్ (23)అనే యువకుడు ఈనెల 12వ తేదీన జాండిల్స్, కిడ్నీ సమస్యలతో బాధపడుతూ అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి దుర్వేసి ఖాన్ ఫిర్యాదు మేరకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంబి రమణ తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగను అందజేస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ : టిడిపి

ప్రజాశక్తి - పాములపాడు

టిడిపితోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని టిడిపి నేతలు అన్నారు. గురువారం నాడు పాములపాడులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి నందికొట్కూరు అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మండల అధ్యక్షులు చెల్లె హరినాథ్ రెడ్డిలు కేసీ కెనాల్‌లో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు టిడిపి మినీ మేనిఫెస్టోను వివరించారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శివశంకర్ స్వామి, బషీర్, తుమ్మలురు శేఖర్, ఏసు, పములపాడు బాషా తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

20న చలో విజయవాడ

- భవన నిర్మాణ కార్మికుల సంఘం

ప్రజాశక్తి - పగిడ్యాల

భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం ఈ నెల 20న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు అబ్దుల్ మజీద్ కోరారు. గురువారం పగిడ్యాలలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితం సాధించుకున్న వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులను కాల రాస్తోందని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా నాలుగేళ్ల నుండి ఎటువంటి క్లెయిమ్స్ అమలు కావడం లేదని, కార్మికుడు మరణం చెందుతే బీమా సౌకర్యం కూడా కల్పించడం లేదని అన్నారు. ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమంలో అత్యధికంగా కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, రాజు, వెంకటేశ్వర్లు, దాము, దివాకర్, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నరసింహుడు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాధికార సభను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఈనెల 19వ తేదీన మదనపల్లిలో జరిగే రాజ్యాధికార సభ జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ నంది కొట్కూర్ అసెంబ్లీ ఇంచార్జ్ ఎల్ స్వాములు పేర్కొన్నారు. గురువారం స్థానిక కాన్సిరాం సర్కిల్ నందు రాజ్యాధికార సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ పాలకులు ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీలను అణచి వేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, తామసు, మధుశేఖర్, ప్రకాశం, మోజేసు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆణిముత్యాల'కు సన్మానం

ప్రజాశక్తి-డోన్

ప్రభుత్వ పాఠశాలలో,కళాశాలలో చదివి మంచి ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించినట్లు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు ఎన్నో వరాలు ప్రకటించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతూ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి కింద రూ.15000, ద్వితీయ బహుమతి కింద రూ.10000 వేలు, తృతీయ బహుమతి కింద రూ.7500 వేల చొప్పున 12 మంది విద్యార్థులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు మంజూరు చేసిందన్నారు. అనంతరం నియోజకవర్గస్థాయిలో పాఠశాలలో కళాశాలలో చదివి మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి తల్లిదండ్రులను పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలును, కళాశాల ప్రిన్సిపల్‌ను శాలువతో ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు.

నందికొట్కూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత స్కూల్ నందు జగనన్న ఆణిముత్యాలు సత్కార కార్యక్రమం గురువారం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ పాఠశాలల్లో/కళాశాలల్లో 10వ తరగతి, వ ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు సత్కార కార్యక్రమం ఎంఈవో ఫైజున్నిసా బేగం ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. చైర్మన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ స్థాయి 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన పాములపాడు మండలం వేంపెంట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి దేశావత్ మౌన్యశ్రీ బాయ్ రూ.15,000 నగదు బహుమతిని, రెండవ స్థానం సాధించిన పాములపాడు మండలం ఎపి మాడల్ స్కూల్ విద్యార్థి పసుపుల వర్షిత్ రూ.10,000 నగదు బహుమతి అందుకోగా, మూడవ స్థానంలో సాధించిన కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి మీనిగ వివేకానంద రూ.5000 నగదు బహుమతి అందుకున్నారు. ఇంటర్మీడియట్‌లో జూపాడుబంగ్లా ఎపి మాడల్ జూనియర్ కాలేజ్ ఎంపీసీ విద్యార్థిని కె.నందిని, పాములపాడు మండలం ఎపి మాడల్ జూనియర్ కాలేజ్ బై.పి.సి విద్యార్థిని యం.నాగరేణుక, పాములపాడు మండలం ఎపి మాడల్ జూనియర్ కాలేజ్ సి.ఈ.సి విద్యార్థిని కె.స్వాతి విద్యార్థినిలకు ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో శోభారాణి, ఎంపీడీవో పగిడ్యాల బి.వి రమణ, ఎంపిపీ మురళీకృష్ణ రెడ్డి, పగిడ్యా ల జడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎమ్మార్వో రాజశేఖర్ బాబు, కౌన్సిలర్ వీరబొమ్మ రూపాదేవి, పగిడ్యా ల ఎంపీపీ మల్లేశ్వరి, జూపాడుబంగ్లా ఎంపీపీ సువర్ణమ్మ, పగిడ్యాల సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, మిడ్తూరు ఎంఈవో మౌలాలి, పగిడ్యాల ఎంఈఓ పి.సుభాన్, నియోజకవర్గ స్థాయి స్కూల్ హెడ్మాస్టర్ లు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ చక్రపాణి, వార్డు ఇంచార్జ్ వి.ఆర్ శ్రీను పాల్గొన్నారు. **పాణ్యం:** చదువుతోనే సమాజాభివృద్ధి నిర్మాణం జరుగుతుందని ఎంఇఒ కోటయ్య నాయక్ అన్నారు. ఉన్నత పాఠశాల ఆవరణం లో జరిగిన జగనన్న ఆణిముత్యాలు, జగనన్న విద్యా కానుక కార్యక్ర మాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు రూపంలో పురస్కారం అందజేశారు. ఎంపిపి హుస్సేన్, వైసిపి నాయకులు సద్దల సూర్య నారాయణ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, ఎంపీడీఓ దస్తగిరి,సర్పంచ్ పల్లవి,ఉప సర్పంచి పాలం చంద్ర శేఖర్ రెడ్డి, చందమామ బాబు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

హామీలు అమలు చేయాలి

ఆత్మకూర్ : ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

(5వ పేజీ తరువాయి..) ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదన్నారు. 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదని తెలిపారు. 2022 ఏప్రిల్ 25న అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చెయ్యమని చెప్పినా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారని చెప్పారు. అంగన్వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామి అమలు చెయ్యలేదన్నారు. సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి అంగన్వాడీలు నెట్టబడ్డారన్నారు. అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె ఎంఆర్‌ఒ, ఎండిఒ, రాజకీయ నాయకులు ఇలా అనేక మంది అంగన్వాడీలను అవమానిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలో హత్యకి గురైన హనుమాయమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూలై 10, 11 కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరవధిక ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్ని జయప్రదం చేయడం ద్వారా ఈ డిమాండ్స్‌ను సాధించుకోవడానికి అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాణి, సునీత, ప్రాజెక్టు నాయకురాలు రమణమ్మ, సావిత్రి, రాధాకృష్ణ, వేణి, కొండమ్మ, రేణుక, సరస్వతి, సారమ్మ, వినీత తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రాజ్యలక్ష్మి, శైలజ, గౌసియాలు మాట్లాడారు. అనంతరం సిడిపిఒకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు ఆళ్లగడ్డ కార్యదర్శి రమేష్ బాబు, నంద్యాల అధ్యక్షుడు బాల వెంకట్, అంగన్వాడీ టీచర్లు గుల్జార్, ముంతాజ్, విజయమ్మ, వేణమ్మ, ఆయాలు పాల్గొన్నారు. **బనగానపల్లె :** అంగన్వాడీ వర్కర్లకు, ఆయాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రోజా రమణి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ ఉమా మహేశ్వరమ్మకు అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ వర్కర్లు మల్లేశ్వరి, శశికళ, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేభారాణి, మండల, పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు, నక్కీశ్రీకాంత్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షమీం బేగం, గౌసియా, మాదేవి అంగన్వాడీ యూనియన్ నాయకురాలు గుల్జార్ బి,మేరీ, రాజేశ్వరి, వరలక్ష్మి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి శివరాంలు డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం దగ్గర మండల కార్యదర్శి నాగలక్ష్మి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మంజుల, హరితలు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి అధికారికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వాములు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు ప్రమీలమ్మ, లక్ష్మీదేవి, రాజమ్మ, మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ వర్కర్లు

డోన్: ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడి వర్కర్లు

'రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట'

ప్రజాశక్తి - ఆత్మకూర్

మాట్లాడుతున్న మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని, అందులో భాగంగానే అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తోందని ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా అన్నారు. గురువారం నాడు ఆత్మకూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహించారు. శ్రీశైల నియోజవర్గంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదును అందించారు. అదేవిధంగా ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందించడంతోపాటు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ ఆసియా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు చదువుతున్న ప్రతి ఒక్కరికి అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ పరమేశ్వరి, మండల అభివృద్ధి అధికారి మోహన్ కుమార్, ఎంఈఓ జానకిరామ్, వైసిపి మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న విద్యా కానుక పేద విద్యార్థులకు వరం లాంటిదని ఎర్రగుంట్ల సర్పంచి కాలూరి శ్వేతకుమారి వైసిపి సీనియర్ నాయకులు కాల్లూరి ప్రసాద్ అన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల నందు గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నాడు నేడు పనుల ద్వారా పాఠశాలల అభివృద్ధి మౌలిక సదుపాయాల ఏర్పాటు జగనన్న కిట్లు స్కూల్ బ్యాగు బూట్లు సాక్షులు యూనిఫామ్ ఉచితంగా ఇవ్వడం వల్ల పేద విద్యార్థులు ప్రతిరోజు బడికి వచ్చేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **పాములపాడు :** మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఎంపీపీ ఎస్ స్కూల్ విద్యార్థులకు సర్పంచి వనమాల ప్రసాదరావు విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూర్ : కిట్లను అందజేస్తున్న సర్పంచి

పాములపాడు : విద్యాకానుక కిట్లను అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులను అభినందిస్తున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

ప్రజాశక్తి - అవుకు

విద్యార్థులు పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అన్నదానికి ఉదాహరణనే నీట్ ఫలితాలలో అవుకు పట్టణానికి చెందిన నలుగురు విద్యార్థులు విజయం సాధించారని వైసీపీ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని చల్లా పార్టీ కార్యాలయంలో నీట్ పరీక్ష ఫలితాల్లో సూర వివేకానంద రెడ్డి, తాలే పల్లె పవిత్ర, తాలేపల్లి పల్లవి, బేరి మహితలను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందు ముందు విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చల్ల రాజశేఖర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధికారులను వేడుకుంటున్న రైతులు

మా పొలాలలో సర్వే నిర్వహించొద్దు

ప్రజాశక్తి - గడివేముల

పోలీస్ అధికారులను వేడుకుంటున్న రైతులు

మా పొలాల్లో 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కొరకు సేర్వేలు చేపటొద్దు అని అధికారులను రైతులు వేడుకున్నారు. గురువారం నాడు మండలంలోని కొట్టపోలూర్ గ్రామంలో 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కొరకు 11వ సర్వేనెంబర్ పొలంలో తహశీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. 11 సర్వే నంబర్లు దాదాపు 30 మంది రైతులు ఏళ్ల తరబడి సాగు చేస్తున్నామని, పొలంలో ఏటువంటి నిర్మాణం చేపటొద్దని అధికారులను రైతులు ప్రాదేయపడ్డారు. రైతులతో తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ భూములు కోల్పోయిన ప్రతి రైతుకు మరొక చోట భూమినీ అందిస్తామని హామీ ఇచ్చారు. పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై బిటీ వెంకటసుబ్బయ్య, పాణ్యం ఎస్సై సుధాకర్ రెడ్డి గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఆర్‌బికెలు రైతుకు భరోసానివ్వాలి

- వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్

ప్రజాశక్తి - పాణ్యం

ఆర్‌బికెలు రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడాలని నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్ అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కేంద్రాలలో ఎరువులు నిల్వ ఉంచుకోవాలని,మట్టి నమూనా సేకరణ ,జియో టాగింగ్,తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, ఎంపిఈఓలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్

కార్మికులను రెగ్యులర్ చేయాలి

(5వ పేజీ తరువాయి..) డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. నంద్యాల మున్సిపాలిటీ నుండి తొలగించిన 44 మంది కార్మికులకు హైకోర్టు తీర్పు ప్రకారం 18 నెలల వేతనాలు చెల్లించాలని, ఇటీవల ఆకస్మికంగా చనిపోయిన మున్సిపల్ కార్మికుడు తులసీరామ్ మధు కుటుంబాన్ని ఆదుకోవాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. అనంతరం మున్సిపల్ ఇంజనీర్ రమణ మూర్తికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి మహమ్మద్ గౌస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి భాస్కరా చారి, నాయకులు ఆదాము, నాగేశ్వరరావు, పవన్, ఆంజనేయులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులను, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తానని చెప్పి ఇప్పుడు మాట మారుస్తున్నారని సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయ కులు నాగన్న, గొడుగు రాజు, జోషఫ్‌లు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎన్ స్వాములు, మున్సిపల్ కార్మికులు ప్రసాద్, దానం, నాగరాజు, రాజేష్, రూతమ్మ, రవి పాల్గొన్నారు. **డోన్**: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం, మండల అధ్యక్షులు పి. రామాంజనేయులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం దగ్గర యూనియన్ ఉపాధ్యక్షులు పెద్ద ఎల్లయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్వో మధుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేవదానం, బలరాముడు, ఆవులయ్య, సుంకన్న, ఏసు, అంజనమ్మ, లక్ష్మీశ్వరి, వెంకటలక్ష్మి, మాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ :వినతి పత్రం ఇస్తున్న నాయకులు

డోన్ : మాట్లాడుతున్న నాయకులు

BEFORE THE HON'BLE REGISTRAT OF CHITS/ARBITRATOR : KURNOOL
I.A.NO.15/2023
IN DISPUTANT NO.217/2022

Between:
M/s Margadarsi Chit Fund Pvt.Ltd.,
Kurnool. ...Disputant
And
T.Narayana Reddy & Others. ...Opponents

Notice to Opponents No.1
T.Narayana Reddy S/o T.Nagi Reddy,
a/a 53 Yeras, H.No.16-46-14,
Subbaraopeta, Nandikotkur (P),
Nandyal (Dist).

పై దావా నందు డిస్ప్యూట్ కంపెనీ వారు. వారికి రావలసిన మొత్తం రూ.12,68,880/- అసలు & వడ్డీ రాబట్టుకొనుటకై Attachment Before judgement U/s 68 of Andhraparadesh Chit Fund Act - 1982 ప్రకారము. దాఖలు చేసినారు. సదరు కోర్టు వారు జారీ చేసిన నోటీసు మీకు ముట్టనందున. సదరు నోటీసు ఈ ప్రకటన ద్వారా మీకు తెలియపరచటమైనది. ఈ ప్రకటన వెలువడిన దినము నుండి మూడు పని దినములలో మీరు సదరు బాకీ మొత్తానికి సరైన జామీను కోర్టువారికి సమర్పించవలయును లేని పక్షములో షెడ్యూలులో చూపించబడిన నందికొట్కూరు గ్రామం సుబ్బారావు పేట ఇంటి నెం.16-46-14, డోర్.నెం.1280/2012 (1), 1281/2012 గల ఆస్తిని జప్తుచేయబడును కోర్టు వారి ఆదేశానుసారంగా మీరు 29-6-23 తేదీ ఉదయం 11.00 గం॥లకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరు గానీ లేద మీ తరపున వకీలుగాని హాజరై ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరాలు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 29-06-2023
By Order of the Deputy Registrar of Chits/Arbitrator : Kurnool

BEFORE THE HON'BLE REGISTRAT OF CHITS/ARBITRATOR : KURNOOL
I.A.NO.16/2023
IN DISPUTANT NO. ARC/ KNL/ 220/2022

Between:
M/s Margadarsi Chit Fund Pvt.Ltd.,
Kurnool. ...Disputant
And
M/s Sree sai Charan Enterprises. ...Opponents

Notice to Opponents No.1
M/s Sree sai Charan Enterprises,
C/o T.Narayana Reddy, H.No.16-46-1A,
Subbaraopeta, Nandikotkur (P), Nandyal (Dist).

పై దావా నందు డిస్ప్యూట్ కంపెనీ వారు. వారికి రావలసిన మొత్తం రూ.24,53,000/- అసలు మరియు వడ్డీ రాబట్టుకొనుటకై Attachment Before judgement U/s 68 of Andhraparadesh Chit Fund Act - 1982 ప్రకారము. దాఖలు చేసినారు. సదరు కోర్టు వారు జారీ చేసిన నోటీసు మీకు ముట్టనందున. సదరు నోటీసు ఈ ప్రకటన ద్వారా మీకు తెలియపరచటమైనది. ఈ ప్రకటన వెలువడిన దినము నుండి మూడు పని దినములలో మీరు సదరు బాకీ మొత్తానికి సరైన జామీను కోర్టువారికి సమర్పించవలయును లేని పక్షములో షెడ్యూలులో చూపించబడిన నందికొట్కూరు గ్రామంలో సుబ్బారావు పేటలో గల ఇంటి నెం.16-46-1ఏ, డో ర్ నెం.1280/2012 (1) మరియు 1281/2012 గల ఆస్తిని జప్తు చేయబడును కోర్టు వారి ఆదేశానుసారంగా మీరు 29-6-23 తేదీ ఉదయం 11.00 గం॥లకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరు గానీ లేద మీ తరపున వకీలుగాని హాజరై ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరాలు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 29-06-2023
By Order of the Deputy Registrar of Chits/Arbitrator : Kurnool

BEFORE THE HON'BLE REGISTRAT OF CHITS/ARBITRATOR : KURNOOL
I.A.NO.05/2023,
DISPUTANT NO. 217/2022

Between:
M/s Margadarsi Chit Fund Pvt.Ltd.,
Kurnool. ...Disputant
And
T.Narayana Reddy & Others. ...Opponents

Notice to Opponents No.1
T.Narayana Reddy S/o T.Nagi Reddy,
a/a 53 Yeras, H.No.16-46-14,
Subbaraopeta, Nandikotkur (P),
Nandyal (Dist).

పై దావా నందు డిస్ప్యూట్ కంపెనీ వారు. వారికి రావలసిన మొత్తం రూ.12,68,880/- అసలు & వడ్డీ రాబట్టుకొనుటకై Attachment Before judgement U/s 68 of Andhraparadesh Chit Fund Act - 1982 ప్రకారము. దాఖలు చేసినారు. సదరు కోర్టు వారు జారీ చేసిన నోటీసు మీకు ముట్టనందున. సదరు నోటీసు ఈ ప్రకటన ద్వారా మీకు తెలియపరచటమైనది. ఈ ప్రకటన వెలువడిన దినము నుండి మూడు పని దినములలో మీరు సదరు బాకీ మొత్తానికి సరైన జామీను కోర్టువారికి సమర్పించవలయును లేని పక్షములో షెడ్యూలులో చూపించబడిన కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు గ్రామములోని సాయిసిరి గార్డెన్ లోని ప్లాట్ నెం.264 ఆస్తిని జప్తుచేయబడును కోర్టు వారి ఆదేశానుసారంగా మీరు 29-6-23 తేదీ ఉదయం 11.00 గం॥లకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరు గానీ లేద మీ తరపున వకీలుగాని హాజరై ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరాలు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయట మైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 29-06-2023
By Order of the Deputy Registrar of Chits/Arbitrator : Kurnool

BEFORE THE HON'BLE REGISTRAT OF CHITS/ARBITRATOR : KURNOOL
I.A.NO.11/2023
IN DISPUTANT NO. ARC/ KNL/ 220/2022

Between:
M/s Margadarsi Chit Fund Pvt.Ltd.,
Kurnool. ...Disputant
And
M/s Sree sai Charan Enterprises. ...Opponents

Notice to Opponents No.1
M/s Sree sai Charan Enterprises,
C/o T.Narayana Reddy, H.No.16-46-1A,
Subbaraopeta, Nandikotkur (P), Nandyal (Dist).

పై దావా నందు డిస్ప్యూట్ కంపెనీ వారు. వారికి రావలసిన మొత్తం రూ.24,53,000/- అసలు మరియు వడ్డీ రాబట్టుకొనుటకై Attachment Before judgement U/s 68 of Andhraparadesh Chit Fund Act - 1982 ప్రకారము. దాఖలు చేసినారు. సదరు కోర్టు వారు జారీ చేసిన నోటీసు మీకు ముట్టనందున. సదరు నోటీసు ఈ ప్రకటన ద్వారా మీకు తెలియపరచటమైనది. ఈ ప్రకటన వెలువడిన దినము నుండి మూడు పని దినములలో మీరు సదరు బాకీ మొత్తానికి సరైన జామీను కోర్టువారికి సమర్పించవలయును లేని పక్షములో షెడ్యూలులో చూపించబడిన బిజినవేముల గ్రామము లోని 0.59 ఎకరాల పోలం డాక్యుమెంట్ నెం. 3695/2021 (బి2) మరియు నాగటూరు గ్రామములోని 2.88 ఎకరాల పొలం డాక్యుమెంట్ నెం.3695/2021 (బి1) ఆస్తులను జప్తుచేయబడును కోర్టు వారి ఆదేశానుసారంగా మీరు 29-6-23 తేదీ ఉదయం 11.00 గం॥లకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరు గానీ లేద మీ తరపున వకీలుగాని హాజరై ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరాలు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 29-06-2023
By Order of the Deputy Registrar of Chits/Arbitrator : Kurnool

BEFORE THE HON'BLE REGISTRAT OF CHITS/ARBITRATOR : KURNOOL
I.A.NO.17/2023 IN
DISPUTANT NO. 220/2022

Between:
M/s Margadarsi Chit Fund Pvt.Ltd.,
Kurnool. ...Disputant
And
T.Narayana Reddy & Others. ...Opponents

Notice to Opponents No.1
T.Narayana Reddy S/o T.Nagi Reddy,
a/a 53 Yeras, H.No.16-46-14,
Subbaraopeta, Nandikotkur (P),
Nandyal (Dist).

పై దావా నందు డిస్ప్యూట్ కంపెనీ వారు. వారికి రావలసిన మొత్తం రూ.24,53,000/- అసలు & వడ్డీ రాబట్టుకొనుటకై Attachment Before judgement U/s 68 of Andhraparadesh Chit Fund Act - 1982 ప్రకారము. దాఖలు చేసినారు. సదరు కోర్టు వారు జారీ చేసిన నోటీసు మీకు ముట్టనందున. సదరు నోటీసు ఈ ప్రకటన ద్వారా మీకు తెలియపరచటమైనది. ఈ ప్రకటన వెలువడిన దినము నుండి రెండు పని దినములలో మీరు సదరు బాకీ మొత్తానికి సరైన జామీను కోర్టువారికి సమర్పించవలయును లేని పక్షములో షెడ్యూలులో చూపించబడిన Opp.No.1 నారాయణ రెడ్డి కి సంబంధించిన నందికొట్కూరు గ్రామం, సుబ్బారావు పేట ఇంళ్ళును 16-46-14, డోర్.నెం.1280/2012 (1) మరియు 1281/2012 ఈ ఇంటిని నందికొట్కూరు స్టేట్ బ్యాంక్ వారు వేలం వేసి తీసి వారి బాకీ జమపడిన తరువాత మిగిలిన సొమ్మును జప్తుకొరకు ఈ దావా తీయడము జరిగింది. కోర్టు వారి ఆదేశానుసారంగా మీరు 29-6-23 తేదీ ఉదయం 11.00 గం॥లకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరు గానీ లేద మీ తరపున వకీలుగాని హాజరై ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరాలు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 29-06-2023
By Order of the Deputy Registrar of Chits/Arbitrator : Kurnool